
సాక్షి
వికారాబాద్
బుధవారం ၊ 27 ၊ డిసెంబర్ ၊ 2023



కాంగ్రెస్‌ది 'ప్రజాపాలన'

ప్రజా సంక్షేమం కోసమే ప్రజాపాలన కార్యక్రమం చేపడుతున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. 8లో▸



కొడంగల్‌లో కమ్ముకున్న పొగమంచు

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస పూజలు



తిరుప్పావై పారాయణం చేస్తున్న శ్రీనివాసాచార్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం వేకువ జామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రజల పక్షాన పోరాటం చేసేది సీపీఐ ఒక్కటే

పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్



తాండూరులో సీపీఐ జెండా ఎగురవేస్తున్న విజయలక్ష్మి పండిట్

తాండూరు టౌన్: ప్రజల పక్షాన పోరాటం చేసేది సీపీఐ ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, విద్యార్థి, మహిళల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టులు చేపట్టిన సాయుధ పోరాటంతోనే దొరల పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం వంటివి సీపీఐ పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, దస్తప్ప, నసీమా, లుక్మన్, నర్సింహులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫిల్మ్ అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా మల్లేశ్



పూడూరు: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ కమిటీ ప్యానల్ మెంబర్‌గా పూడూరు మండల వాసి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్‌ను నియమిస్తూ హైదరాబాద్ రీజియన్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రాంతీయ అధికారి శిపాలీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 2023 నుంచి డిసెంబరు 2025 వరకు సభ్యుడిగా కొనసాగుతారని తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ పటేల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బోర్డు మెంబర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పని చేసే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని అన్నారు. తనను నియమించిన బీజేపీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏళ్ల పోరాటం నెరవేరబోతోంది

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: అయోధ్యలో రామ మందిర నిర్మాణంకోసం ఏళ్లుగా చేసిన పోరాటం జనవరి 22న నెరవేరనుందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని అక్కడి నుంచి వచ్చిన రాముని అక్షింతలను మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయ వద్ద మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామమందిరం ప్రాణప్రతిష్ఠ దేశ ప్రజలందరికీ పండుగ రోజన్నారు. జనవరి 22న అంతా పండుగ చేసుకోవాలన్నారు. ప్రణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలంతా వీక్షించే ఏర్పాట్లు చేయాలన్నారు. దేశంలోని ప్రతి ఇంటికీ రాముని అక్షింతలు వెళ్లాలని.. వాటికి పూజలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి సంజయ్ సావర్కర్, అనంతగిరి జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి శ్రీలతరెడ్డి, హిందూ సంఘాల నేతలు పాల్గొన్నారు.



అమిత్‌షా కార్యక్రమ పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్రంలో మళ్లీ బీజేపీదే గెలుపు

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమావేశ ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్రంలో మరోసారి భారీ మెజార్టీతో నరేంద్రమోదీ సర్కార్ రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 28న కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న పార్టీ పదాధికారుల సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. డబుల్ ఫిగర్ ఎంపీలు గెలుపొందడమే లక్ష్యంగా సమావేశం ఉంటుందన్నారు. ఇందుకోసం దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి అమిత్‌షాతో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సాల్, అరవింద్ హాజరుకానున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వనపర్తి ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్, పోరెడ్డి నర్సింహారెడ్డి, నోముల దయానంద్, లచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దన్నె భాషయ్య, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమ్మేసిన పొగమంచు

ధారూరులో పొగమంచు కారణంగా కనిపించని రోడ్డు

రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జిల్లాను పొగమంచు కప్పేసింది. మంగళవారం ఉదయం 8గంటలైనా మంచుతెరలు వీడలేదు. దీంతో రోడ్లు, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. రెండు రోజుల క్రితం రోడ్డు కనిపించక ఓ కారు చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన తెలిసిందే.. దట్టమైన పొగమంచు కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనదారులు అప్రమత్తంగా ఉండటం క్షేమదాయకం.

'ప్రజాపాలన'కు సన్నద్ధం

అభయ హస్తం పేరిట కార్యక్రమాలు

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మండలానికి రెండు టీమ్‌ల ఏర్పాటు
- జనవరి 6వరకు గ్రామ సభలు



కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమం రేపటి నుంచి ప్రారంభం కానుంది. అభయ హస్తం పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 30, 31వ తేదీ సెలవు దినాలుగా ప్రకటించారు. ప్రజాపాలన ఏర్పాట్లపై ఇప్పటికే కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలు, నిబంధనలు తెలియజేశారు.

అధికారులకు బాధ్యతలు

ఈ కార్యక్రమం సజావుగా సాగడంతో పాటు పర్యవేక్షించేందుకు నియోజకవర్గాలు, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వికారాబాద్‌కు ఆర్డీఓ విజయకుమారి, తాండూరుకు ఆర్డీఓ శ్రీనివాస్, పరిగికి డీపీఓ తరుణ్‌కుమార్, కొడంగల్‌కు డీఆర్డీఓ కృష్ణన్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని కేటాయించారు. అలాగే ఒక్కో మండలానికి రెండు టీంలను ఏర్పాటు చేయగా ఇందులో ఒక టీంకు ఎంపీడీఓ, మరో టీంకు తహసీల్దార్ ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు.

రోజుకు రెండు గ్రామ సభలు

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ రెండు గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

అన్నింటికీ ఒకే దరఖాస్తు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి ఈ నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు అందజేస్తారు. ఒక కుటుంబం ఒక దరఖాస్తు మాత్రమే చేసుకునేలా ఫారాలు తయారు చేశారు. అర్జీలు నింపేందుకు అవగాహన కల్పించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తాం. సభ నిర్వహించే గ్రామంలో ఒక రోజు ముందుగా దండోరా వేయించేలా ఆదేశాలు జారీ చేశాం. సభకు వచ్చే జనాభాను బట్టి కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. మహిళల కోసం ప్రత్యేక కౌంటర్ ఉంటుంది. అందరి నుంచి దరఖాస్తులు తీసుకుంటాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గడువు ముగిసిన మరుసటి రోజుకూడా దరఖాస్తులు స్వీకరిస్తాం. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

పకడ్బందీగా అమలు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదల ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇ ల్లు, చేయూత పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులన్నారు. రోజుకు రెండు పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, డిప్యూటీ తహసీల్దార్లు టీములుగా ఏర్పాటు చేసుకొని కుటుంబాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కింది స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి అధికారుల వరకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. మున్సిపల్ వార్డుల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ, భద్రపర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డీఆర్‌ఓ సంగీత, ఆర్డీఓలు సూరజ్‌కుమార్, మల్లయ్య, శ్రీనివాస్, సాయిరాం పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కందుకూరు: ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు, సిబ్బంది పని చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశపుహాల్‌లో మంగళవారం కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించి ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను సేకరిస్తారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీడీఓలు ఎస్.వెంకట్రాములు, నర్సింహులు, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పరిమళపత్రి, పరిణిత పత్రి, ట్రస్ట్ సభ్యులు

ధ్యాన జగత్‌కు కృషి చేయాలి

- పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- ఆరో రోజుకు చేరిన ధ్యాన మహాయాగం



కళాకారిణుల నృత్య ప్రదర్శన

కడ్తాల్: ధ్యానజగత్తు కల 2030 నాటికి సాకారం అయ్యేందుకు ధ్యానులు ఐకమత్యంతో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మహేశ్వర మహాపిరమిడ్ షిర్డీ క్షేత్రంలా విరాజిల్లుతుందని ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ చెప్పేవారని గుర్తు చేశారు. మహేశ్వర పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ప్రాతఃకాల సంగీత ధ్యానంతో పాటు, ప్రత్యేకించి దత్తపౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 5 నుంచి 12 గంటల వరకు వేలాది మంది ధ్యానులతో సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పత్రీజీ ఆశయ సాధనకు, ధ్యాన జగత్తు నిర్మాణానికి ప్రతి పిరమిడ్ మాస్టర్, ధ్యాని కృషి చేయాలని కోరారు. మహేశ్వర మహాపిరమిడ్ కేంద్రానికి మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు రూ. కోటి విరాళం అందించడం శుభపరిణామమని అన్నారు.

ధ్యాన కేంద్రాన్ని తీర్చిదిద్దుతాం..

పత్రీజీ స్వప్నమైన ధ్యానజగత్తు కల సాకారానికి ప్రతి పిరమిడ్ మాస్టర్ కృషి చేయాలని పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళపత్రి అన్నారు. ధ్యాన మహాయాగం అద్భుత విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే సీఎం, పీఎంలు కూడా మహేశ్వర మహాపిరమిడ్ క్షేత్రానికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఏడాదిలో ధ్యానులతో మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రం కళకళలాడేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అనంతరం పత్రీజీ గురువు సదానందయోగి జీవిత చరిత్రపై పూర్ణిమ, లక్ష్మీనారాయణమ్మ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హనుమంతరాజు, మేనేజింగ్ డైరెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సర్దుబాటు'.. గ్రహపాటు

ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖల్లో బాధ్యతలు తీసుకున్న వీఆర్‌ఏలకు నాలుగు నెలలుగా జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి గ్రామ రెవెన్యూ సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించింది. అయితే గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. వేతనాలు అందక అప్పులపాలవుతున్నారు.

- వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన గత ప్రభుత్వం
- సమ్మె కాలంతో కలిపి ఎనిమిది నెలల జీతం కోసం ఎదురుచూపులు
- కొత్త ప్రభుత్వంపై గంపెడశలు



పరిగి తహసీల్దార్ కార్యాలయం

పరిగి: వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన గత సర్కారు వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. ఈ ప్రక్రియ పూర్తయి నాలుగు నెలలు దాటినా వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు గత ప్రభుత్వ హయాంలో ఆందోళన చేపట్టారు. దిగివచ్చిన అప్పటి పాలకులు వారిని క్రమబద్ధీకరించారు. గతంలో వీరికి 9 వేల రూపాయల వేతనం వచ్చేది. వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వారి అర్హతను బట్టి వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేటర్లుగా, మున్సిపల్, నీటిపారుదల, మిషన్ భగీరథ శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే గుర్తింపు కార్డులు జారీ చేయలేదు. జీతాలు కూడా ఇవ్వలేదు.

600మంది సర్దుబాటు

జిల్లా వ్యాప్తంగా 566 గ్రామాలు ఉండగా 644 మంది వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆయా శాఖల్లో సర్దుబాటు చేసింది. జూనియర్ అసిస్టెంట్లకు రూ. 24,240 వేతనం, రికార్డు అసిస్టెంట్లకు రూ.22,150 వేతనాలు చెల్లిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. సమ్మె కాలం మొదలుకొని మొత్తం ఎనిమిది నెలల జీతం అందక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్న సంతోషం తప్ప తమకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని సర్దుబాటు ఉద్యోగులు కోరుతున్నారు.

అందని గుర్తింపు కార్డులు

వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన గత ప్రభుత్వం నియామక పత్రాలు జారీ చేసినా గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. కార్డు ఉంటేనే ఉపయోగం, వాటి ఆధారంగానే వేతనాలు వస్తాయి. నాలుగు నెలలు అవుతున్న వేతనాలు రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైనా త్వరగా కార్డులు జారీ చేయాలని వారు కోరుతున్నారు.

వేతనం రావడం లేదు



ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని ఎంతో సంతోషపడి విధుల్లో చేరా. నాలుగు నెలలు దాటినా వేతనాలు రాలేదు. దీంతో తప్పులు తెచ్చి కుటుంబాన్ని పోషించాల్సి వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మా సమస్యను పరిష్కరించాలి.

– శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్

గుర్తింపు కార్డులు ఇవ్వాలి



తమకు గుర్తింపు కార్డుతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలి.రోజూ విధులకు వెళుతున్నా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. ఉద్యోగం చేసేది జీతం కోసమే.. కానీ ఆ జీతమే ఇవ్వకుంటే ఎలా?. వెంటనే వేతనాలు చెల్లించాలి.

–మహేందర్, జూనియర్ అసిస్టెంట్

క్లుప్తంగా

బ్రహ్మ కమలం... పుష్ప వికాసం



బ్రహ్మకమలంతో పూజలు చేస్తున్నప్రదీప్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: పుష్పాలలో చాలా అరుదైనది బ్రహ్మ కమలం. శీతల ప్రాంతాల్లో కనిపించే బ్రహ్మ కమలం షాద్‌నగర్‌లో వికసించింది. పట్టణంలోని భగీరథ కాలనీకి చెందిన నటరాజ కళానిలయం వ్యవస్థాపకుడు మానపాటి ప్రదీప్‌కుమార్ ఇంట్లో సోమవారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. ప్రదీప్‌కుమార్ కుటుంబ సభ్యులు కిషన్‌నగర్ సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మకమలం పుష్పాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడిని బ్రహ్మకమలం పుష్పాలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. అరుదుగా వికసించే ఈ పుష్పాలను చూసేందుకు కాలనీ వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

బాలికల క్రికెట్ టోర్నీ విజేత రంగారెడ్డి



విజేతగా నిలిచిన రంగారెడ్డి జట్టు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీ హోమిబాబా క్రీడామైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్‌-17 బాలికల క్రికెట్ పోటీలు మంగళవారం ముగిసాయి. టోర్నీ విజేతగా రంగారెడ్డి జట్టు నిలవగా రన్నరప్‌గా మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఖమ్మం జట్టు నిలిచాయి. మంగళవారం జరిగిన మొదటి సెమీస్‌లో రంగారెడ్డి, నిజామాబాద్ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు గెలిచి ఫైనల్స్ చేరింది. రెండో సెమీస్ ఆతిథ్య ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరగగా మహబూబ్‌నగర్ జట్టు గెలుపొంది ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఫైనల్స్‌లో రంగారెడ్డి – మహబూబ్‌నగర్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రంగారెడ్డి జట్టు 12 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 109 పరుగుల భారీ స్కోర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 49 పరుగులకే ఆలౌట్ కావడంతో రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం – నిజామాబాద్ జట్లు తలపడగా ఖమ్మం జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు అతిథులు బహుమతులు అందజేశారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేశ్

మొయినాబాద్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా మొయినాబాద్‌కు చెందిన కుమ్మరి రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి యాలాల మహేశ్వరరెడ్డి రమేశ్‌కు నియామకపత్రం అందజేశారు.

కాంగ్రెస్‌ది ‘ప్రజాపాలన’

సకల జనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- 28 నుంచి గ్రామాల్లో గ్రామసభలు
- అర్హులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి



పరిగి: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమం కోసమే ‘ప్రజాపాలన’ చేపడుతున్నామని ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రజాపాలన కార్యక్రమం గురించి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమాన్ని కలిసికట్టుగా నిర్వహించాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలుకోసం కృషి చేయాలని సూచించారు. వాటిని నెరవేర్చేందుకు ఈ గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, తమకు కావాల్సిన సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకోవాలని కోరారు. ఇందు కోసం ప్రతి గ్రామానికి ఒక అధికారిని ప్రభుత్వం నియమించి, వారి ద్వారానే అర్హులను ఎంపికచేస్తుందని పేర్కొన్నారు.

అందుబాటులో ఉంటా..

కాంగ్రెస్ పాలన అంటే ప్రజా పాలన అని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమ కోసం పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా.. వాటిని తీర్చేందుకు క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కుల్కచర్ల, దోమ ఎంపీపీలు సత్యహరిశ్చందర్, అనసూయ, పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఆయ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

47 పంచాయతీల్లో సభలు

బొంరాస్‌పేట: ప్రజాపాలన(అభయహస్తం) కార్యక్రమాలు గ్రామాలవారీగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. ఈ నెల 28 ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండుపూటలా ప్రజాపాలనను ఏర్పాటు చేసింది. మండల పరిధి 47 గ్రామపంచాయతీల్లో మండలంలో తహసీల్దారు వెంకటేశ్, దుద్యాల తహసీల్దారు దానయ్య, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దారు రవిలు టీమ్‌లీడర్లుగా కొనసాగనున్నారు.

ఏ ఊరిలో ఏరోజు..

28 నుంచి జనవరి 6వరకు ప్రత్యేక అధికారుల నిర్వహణలో ప్రజాపాలన ఉంటుంది. 28న సాలిండాపూర్, టేకులగడ్డ, గౌరారం, సాగారంతండా, బుర్రితండా, మెట్లకుంట, ఏనెమీదితండా(వడిచర్ల), ఏనెమీదితండా(కొత్తూరు), 29న హంసాన్‌పల్లి, ఎక్కచెర్వుతండా, గట్టిగానితండా, కుబ్యానాయక్‌తండా, సూర్యానాయక్‌తండా, జానకంపల్లి, బాపల్లి, మేడిచెట్టుతండా, 30న చెట్టుపల్లితండా, సత్తర్‌కుంటతండా, నాగిరెడ్డిపల్లి, లోతికుంటతండా, మదన్‌పల్లితండా, మదన్‌పల్లి, బాపన్‌చెర్వుతండా, మూడుమామిళ్లతండా, జనవరి 2న ఈర్లపల్లి, సత్తర్‌కుంటతండా, లింగన్‌పల్లి, బొట్లోనితండా, మహంతీపూర్, దుప్‌చర్ల, 3న రోటిబండతండా, లగచర్ల, చిల్మల్‌మైలారం, నాజ్‌ఖాన్‌పల్లి, ఏర్పుమళ్ల, బురాన్‌పూర్, కాకర్లగండితండా, 4న బొంరాస్‌పేట, దుద్యాల, చౌదర్‌పల్లి, రేగడిమైలారం 5న అల్లిఖాన్‌పల్లి, ఎన్కేపల్లి, వడిచర్ల, 6న కొత్తూరు, తుంకిమెట్ల, నాందార్‌పూర్‌లో గ్రామసభలు, దరఖాస్తులు స్వీకరించనున్నారు.

రేపటి నుంచి..

కొడంగల్: రేపటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ పాండు తెలిపారు. 28 నుంచి జనవరి 5 వరకు అన్ని గ్రామాల్లో సభలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ పరిధి 12 వార్డుల్లో 28 నుంచి 6 వరకు ప్రజాపాలన ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి వార్డుకు సిబ్బందిని నియమించామన్నారు.

ఏర్పాట్లు ముమ్మరం..

ఎంపీడీఓ లక్ష్మప్ప

పెద్దేముల్: ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మప్ప పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. 28న ఖానాపూర్, కందనెల్లి, చైతన్యనగర్, మంబాపూర్, కందనెల్లితండా, గొట్లపల్లి, 29న కొండాపూర్, జనగాం, దుగ్గాపూర్, మారేపల్లితండా, మదనంతపూర్, మన్‌సాన్‌పల్లి, 30న గిర్మాపూర్, జైరాంతండా, రుక్మాపూర్, రెగోండి, ఇందూరు, హన్మాపూర్, జనవరి 2న రుద్రారం, నాగులపల్లి, బండపల్లి, పెద్దేముల్, మారేపల్లి, గోపాల్‌పూర్, 3న బుద్దారం, గాజీపూర్, ఆత్కూర్, ఎర్రగోడుతండా, సిదన్నమడుగుతండా, తట్టెపల్లి, 4న జైరాంతండా, ఓంలానాయక్‌తండా, పాషాపూర్, బండమీదిపల్లి, 5న ఊరేంటితండా, అడ్కిచెర్ల, బామిదితండా గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజాపాలనకు టీం లీడర్‌లుగా ఎంపీడీఓ లక్ష్మప్ప, తహసీల్దార్ కిషన్, మండల వ్యవసాయ అధికారి నజీరోద్దీన్‌తో పాటు పలు శాఖల అధికారులను నియమించినట్లు వివరించారు. వీరు వాటిని పర్యవేక్షించనున్నారని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు చూసుకోవాలని సూచించారు.



బుద్దారం పంచాయతీ కార్యాలయం

శుభకార్యానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి..

యాచారం: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన కట్టెల యాదయ్య కుమారులైన నాని (18) సన్నీలు, వీరి స్నేహితుడు చేదురుబావి మనోహర్ సోమవారం రాత్రి యాచారం మండల కేంద్రంలో జరిగిన బంధువుల శుభకార్యానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా.. యాచారం నుంచి మాల్ వైపు వేగంగా వెళ్తున్న కారు, వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాని అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సన్నీ, మనోహర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను యాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు. ప్రమాదంలో ఒక కొడుకు మృతి చెందగా, మరో కొడుకు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

శంకర్‌పల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలింగపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మహాలింగపురం గ్రామ శివారుల్లోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అదుకున్న పోలీసులు.. పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.75,260 నగదు, 9 సెల్‌ఫోన్‌లు, ఆరు కార్లను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.



తీగలే ఆధారం!

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధి మహావీర్ ఆస్పత్రి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం ఒరిగింది. కేవలం తీగలపై ఆధారపడి గాలిలో ఉంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం అటుగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, పశువులు, వాటి కాపర్లు తిరుగుతుంటారని స్థానికులు చెప్పారు. అంతే కాకుండా ఈ లైన్ నుంచే మహావీర్ ఆస్పత్రి, వెంకటాపూర్ తండాలకు విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా నేలకు ఒరిగి ఉన్న స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

పార్కింగ్‌తో పరేషాన్!

రోడ్డుపైనే వాహనాల నిలుపుదలతో అవస్థలు



అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. రైలు ప్రయాణం చేసే పట్టణవాసులు నిబంధనల ప్రకారం రైల్వే స్టేషన్‌లోని పార్కింగ్‌లో వాహనాలు నిలపాలి. అలా కాకుండా ఎదురుగా ఉన్న అంబేడ్కర్ చౌరస్తా ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రహరీ పక్కన పెద్ద ఎత్తున వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్ నుంచి పట్టణంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు ఇక్కడి నుంచే మళ్లాల్సి వస్తుంది. ఈ సర్కిల్ చిన్నగా ఉండటంతో బస్సులు మళ్లడానికి ఇబ్బందిగా ఉందని డ్రైవర్లు తెలిపారు. ఉదయం పార్కింగ్ చేసి వెళ్లి, రాత్రి వారు వచ్చే వరకు రోడ్డుపైనే వాహనాలు ఉంటున్నాయి. కొందరు వాహనదారులు ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ కార్యాలయంలోనూ తమ వాహనాలను నిలిపి వెళ్లడం ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్లు గడిచినా.. ఎదురు చూపులే

అందని ద్రాక్షగా డబుల్ బెడ్‌రూంలు

- ఏడేళ్లైనా పిల్లర్లకే పరిమితం
- అధికార మార్పుతో నిరుపేదల ఆందోళన
- సొంతింటి కోసం ఎదురుచూపులు



మోమిన్‌పేటలో పిల్లర్లకే పరిమితమైన డబుల్ ఇళ్ల నిర్మాణం

మోమిన్‌పేట: గూడు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కానీ సంవత్సరాలు గడిచినా అర్హులకు అవి అందని ద్రాక్షగానే మిగిలాయి. పిల్లర్ల వద్ద నిర్మాణ పనులు ఆగిపోయి ఏళ్లు గడుస్తున్నా పురోగతి కన్పించడం లేదు. గత ప్రభుత్వాలు చిన్న చిన్న ఇండ్లు నిర్మించుకొనేందుకు తక్కువ మొత్తంలో డబ్బులు మంజూరు చేసేవని, ప్రత్యేక తెలంగాణలో అలాంటివి జరగకుండా ఎంత ఖర్చైనా భరించి, రెండు పడక గదులు నిర్మించి, పేదోడి సొంతింటి కల నెరవేరుస్తుందని నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులను ఆశల్లో ముంచెత్తింది. కానీ వారి ఆశలు నిరాశగానే మిగిలాయి.

డబుల్‌కు మంగళం పాడినట్లేనా?

మండల పరిధిలో కొన్ని ఇండ్లు మాత్రమే మంజూరు చేసినా, అవి పిల్లర్ల వద్దే ఆగిపోయాయి. ఇంకా కొన్ని గ్రామాల్లో పునాదులు కూడా తీయలేదు. దీంతో ఇళ్లు లేని పేదలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొనడంతో బీఆర్‌ఎస్ హయాంలో మొదలు పెట్టిన ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఇందిరమ్మ ఇండ్లు అంటే ఇంకెంత కాలం పడుతుందోనని, గత ప్రభుత్వం ఇస్తామన్న డబుల్ ఇళ్లు వస్తాయా? లేక మంగళం పాడినట్లేనా అనే అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

మండలంలో...

మండల కేంద్రం మోమిన్‌పేటలో 140 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏడు సంవత్సరాల క్రితం నాటి రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. రెండేళ్ల క్రితం డబుల్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టినప్పటికీ.. అవి పిల్లర్లకే పరిమితం అయ్యాయి.

గిట్టుబాటు కాలేదని..

తాజామాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డబుల్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించి ఏడాది గడిచినా కదలిక లేదు. గిట్టుబాటు కావడం లేదని సబ్ కాంట్రాక్టరు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు సమాచారం. టెండరులో నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్.. మిగతా పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది. ఏది ఏమైనా ఇళ్ల కోసం ఏండ్లు గడుస్తున్నా.. ఎదురు చూపులు తప్పడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూంల నిర్మాణాలు పూర్తి చేయించి, అర్హులకు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ

మంచాల: మాదక ద్రవ్యాల నుంచి యువతను విముక్తి చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రకటించారు. మంగళవారం మంచాల పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చూసిన సీసీ కెమెరాల అనుసంధాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత జీవితాలను చిత్తు చేస్తున్నాయని, ఈ జాడ్యం పాఠశాలలు, స్కూళ్లకు పాకడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసినా.. తీసుకున్న కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీ కెమెరాల పాత్ర కీలకం

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. దోషులను గుర్తించడంతో పాటు వారికి శిక్షపడడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. మంచాల మండలంలో 15 గ్రామాల్లో 136 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు రక్షణ కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు శాంతిభద్రతల విషయంలో పూర్తి సహకారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి.. నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలు, యువత, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, మంచాల సీఐ కాశీవిశ్వనాథ్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకోరుల ‘గుడి’పురాణీ!

- ఆలయాల పేరుతో భూముల స్వాహా
- రెండు ఎకరాల్లో మూడు దేవాలయాలు..
- అరికట్టడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలం



ప్రభుత్వ భూమిలో నిర్మించిన దేవాలయాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అదో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం. ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.30 కోట్లు. ఇంకేం.. కబ్జాదారుల కన్ను పడింది. గుడుల పేరుతో యథేచ్ఛగా కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు. ఎన్నికల హడావిడిలో అధికారులుండగా భూమిని చదును చేసి గుడులను నిర్మించారు కబ్జాదారులు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం. నగర శివారుల్లోని మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు. హైదరాబాద్‌–బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే కబ్జా పర్వం కొనసాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం చూసిచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారి తీస్తోంది. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో సర్వే నంబర్ 176లో సుమారు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. 60 ఏళ్ల క్రితం ఈ భూమిని పేదలకు అసైన్డ్ చేశారు. అప్పట్లో అసైన్డ్ ద్వారా 4 ఎకరాల భూమి పొందిన ఓ రైతు విక్రయించాడు. అసైన్డ్ చట్టానికి విరుద్ధంగా భూమిని విక్రయించడంతో ప్రభుత్వం పీఓటీ చట్టం కింద ఆ భూమిని స్వాధీనం చేసుకుంది. తరువాత ఆ భూమిని దిల్ సంస్థకు కేటాయించింది. అయితే ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కొంతకాలానికి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. దీంతో ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేశారు. రెండేకరాల భూమిని చదును చేసి కబ్జా చేశారు. అధికారులు అసెంబ్లీ ఎన్నికల పనుల్లో ఉండటంతో కబ్జా చేసిన భూమిలో మూడు గుడులను నిర్మించారు. వాటికి రంగులు వేసి దేవుడి ఫొటోలు, విగ్రహాలు పెట్టారు. భూమిలో అక్కడక్కడ ఉన్న రాళ్లపై సున్నం, జాజు రంగులు వేశారు.

నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

నగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో సుమారు రూ.30 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా రెవెన్యూ యంత్రాంగం నిద్రావస్థలో ఉంది. హైదరాబాద్‌- బీజాపూర్ జాతీయ రహదారికి చేరువలో ఉన్న ప్రభుత్వ భూమిని దుండగులు కబ్జా చేసి గుడులు నిర్మించినా అధికారులకు తెలియకపోవడం శోచనీయం. ఎన్నికల ముందే ప్రధాన పార్టీల అభ్యర్థులు గుళ్ల నిర్మాణానికి పూజలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌ను వివరణ కోరగా భూ కబ్జా విషయం తమకు తెలియదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ప్రభుత్వ భూమిలో బోరు వేస్తున్న కబ్జాదారులు (ఫైల్)

అభివృద్ధిపై గత పాలకుల నిర్లక్ష్యం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: జేపీ దర్గా అభివృద్ధిపై వక్ఫ్‌బోర్డు అధికారులు, గత పాలకులు అనుసరించిన తీరు దారుణంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. త్వరలో జరగనున్న ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆయన పలువురు నాయకులతో కలిసి మంగళవారం దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దర్గాను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారనే తప్పా ఎలాంటి అభివృద్ధి చేయలేదని తప్పుబట్టారు. ప్రణాళిక ప్రకారం పనులు జరగకుండా అధికారులు, పాలకులు కాలయాపన చేశారని ఆరోపించారు. దర్గాకు హుండీ, టెండర్ల రూపంలో వక్ఫ్‌బోర్డుకు కోట్ల రూపాయాల ఆదాయం వస్తున్న అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. భక్తులకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు.

వెంటనే సౌకర్యాలు కల్పించాలి

త్వరలో జరగనున్న ఉర్సుకు భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని శంకర్ తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మొబైల్ టాయిలెట్స్, తాగునీటి వసతి, స్నానాల గదులతో పాటు పలు సౌకర్యాలు, వసతులు కల్పించాలని వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. దర్గా సమీపంలోని చెరువులోకి భక్తులు వెళ్లకుండా సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాం సుందర్‌రెడ్డి, నాయకులు బాబార్‌ఖాన్, ఇబ్రహీం, ఖాజా, రవికుమార్ గుప్తా, మసూద్, రవి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

పహాడీషరీఫ్: టిప్పర్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండనాగుల గ్రామానికి చెందిన ఆంజనేయులు(30) ఎల్‌బీనగర్‌లోని గుంటి జంగయ్య కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం తన సొంతూరు నుంచి బైక్‌పై హైదరాబాద్ బయలుదేరాడు. ఉదయం 8.30 గంటల సమయంలో తుక్కుగూడ ఇమాంగూడ వద్ద వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.